


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### టీ.వీ కథ

**మా కాలనీలో పాపం** చెన్నకేశ్వరరావు అని వుండేవాడు. అసలు పాపం అని ఎందుకు మొదలుపెట్టానో, ఏవంత కష్టం వచ్చిందో ఆ మనిషికి అని ఆలోచిస్తున్నారా? కొన్ని ఆరోగ్యరీత్యా, కొన్ని ఆర్థిక కారణాల దృష్ట్యా, కొన్ని సామాజిక చైతన్యాల ద్వారా వస్తాయి కష్టాలు. అలాంటి ఒక సామాజిక చైతన్యం, ఆధునిక ప్రగతివల్ల అతనికి కష్టాలొచ్చాయి.

మా చిన్నతనంలో మా యింట్లో రేడియో వుండేది. ఆ తరువాత టేప్‌రికార్డర్ వచ్చింది. అంటే రికార్డర్ నొక్కి టేప్ చేయచ్చు కానీ అందులో రేడియో వుండదు. టేబుల్ ఫ్యాన్‌లు పోయి సీలింగ్‌ఫ్యాన్‌లొచ్చాయి. అవి కింద పడ్తాయి అన్న భయంతో మా అత్తగారు మంచం "అసింటా జరుపు అమ్మాయి", అని దాని కింద వెయ్యనిచ్చేవారు కాదు. గ్యాస్‌స్టవ్ కనెక్షన్‌కీ తాతలు దిగొచ్చేవారు. ఇక టెలిఫోన్ అయితే శ్రీమంతుల విలాస వస్తువు. మధ్యతరగతి వాళ్ళు ఉత్తరాలూ, టెలిగ్రామ్‌లూ మహా అయితే ట్రంక్ కాల్స్ మీద ఆధారపడి బతికేవారు.

బాపూగారి కార్టూన్ ఒకటి వుంది. బాగా పప్పేసుకుని తిని, పడకకుర్చీలో పడుకుని, విసినికర్రతో విసురుకుంటున్న ఒక ఆయన పక్కన 'బొయ్యి'మన్నట్లు నోరు తెరుచుకున్నలాంటి పాతకాలపు గ్రామ్‌ఫోన్ ఒకటి వుంటుంది. అందులోంచి 'పాడవే రాట్నమా' అన్న టంగుటూరి సూర్యకుమారి గొంతో, లేక 'సోజా రాజకుమారీ' అన్న సైగల్ పాటో వస్తూ వుంటుంది. వెనకాల 2015 క్యాలండర్. గుమ్మం వెనుక వున్న భార్య "ఒక ట్రాన్సిస్టర్ కొనిపెడ్దురూ?" అంటుంది. ఆయన వెంటనే మండిపడి "బజార్లోకి కొత్త వస్తువు వస్తే చాలు ఎగబడిపోవడమే.. హన్నా!" అని అరుస్తాడు.

అలా కొంతమంది ప్రగతి నిరోధకులు వుంటారు. కానీ అసలు ఈ చెన్నకేశ్వరరావు ఏం చేసి 'పాపం చెన్నకేశ్వరరావు' అయ్యాడో అని మీ సందేహం నేను తీర్చలేదు కదూ! వినండి.

ఆ రోజుల్లో ఒక ప్రభంజనంలా వచ్చిపడిన వార్త "చెన్నకేశ్వరరావు టెలివిజన్ కొన్నాడు" అన్నది. అంతా తెల్లబోయాం. నలుపూ తెలుపులలో వారానికి రెండు సినిమాలుట. ఇంట్లోనే అని. మేం స్కూల్లో వున్నాం. ఊహ తెలిసింది. ఏడో క్లాసు అనుకుంట.

అంతకు ముందు మార్వాడీ సేట్ ఇంట్లో టీ.వీ చూడ్డానికి మా ఆస్పత్రిలో హెడ్ నర్స్ రికమండేషన్‌తో వాళ్ళ అమ్మాయి 'నూతన్'తో వెళ్ళాను.

టీ.వీలో హిందీ సీరియల్స్‌లోలా వాళ్ళది ఉమ్మడి కుటుంబం మఫత్‌లాల్, సోషన్‌లాల్ ఎండ్ బ్రదర్స్ అనుకుంట. పెద్ద విశాలమైన హాలు. వాళ్ళింట్లోనే చిన్నపిల్లలు ఇరవైమందీ, కొడుకులూ, కోడళ్ళూ ఓ పదహారు మందీ, ముసలాళ్ళు ఓ ఐదుగురూ వుండేవారు. పైన ఎత్తైన సింహాసనంలాంటి స్టాండ్ మీద 'డయనోరా' టీ.వీ పెట్టారు. కింద తివాచీ మీద మేం వెళ్ళిన పదిమందీ, వాళ్ళ పిల్లలూ కూర్చున్నాం. 'మల్లీశ్వరి' సినిమా ప్రారంభం ఐంది. వాళ్ళకి తెలుగు రాదు. 'ఓ క్యా బోల్తా హై?' అని ఆ ఇంటి వాళ్ళ అమ్మాయి నన్ను అడగడం. నేను చెప్పడం. ఇలా సగం సినిమా మిస్ అయ్యాం. కానీ ఏ మాట కామాటే చెప్పుకోవాలి. గౌరవంగా చూసారు.

ఇక మా కాలనీలో 'చెన్నకేశ్వరరావు' కథ కొద్దాం. పక్కవాళ్ళు, ఎదురువాళ్ళు సాయంకాలమే వంటలు ముగించుకుని తయ్యారయిపోయారు. అతని బావమరిదీ భార్య, మరదలూ, కుటుంబం, తల్లీ తండ్రీ, పినతండ్రులూ, పిన తల్లులూ, మావయ్యలూ, అత్తయ్యలూతో ఆ చిన్న క్వార్టర్ కిటకిటలాడింది. కిటికీలూ, తలుపులూ వేసేస్తే, మా కాలనీ రౌడీ పిల్లలతోబాటు, రిసాలా గడ్డ మీదున్న రౌడీ బాకర్‌బాయితో సహా వచ్చి తలుపులు తియ్యమని రాళ్ళతో కొట్టి గలాటా మొదలు పెట్టారు. సినిమా మొదలయింది. ఒక్కమాట విననివ్వరే. "ఖోల్ సాలా ఖోల్ దర్వాజా" అని కేకలూ, అరుపులూ.. "తియ్యరా.." అంటూ సంస్కృతంలో తిట్లు.

ఏం చెయ్యాలో పాలుపోని చెన్నకేశ్వరరావు ఆ తర్వాతి వారం పోలీసుల శరణు కోరాడు. ఈలోగా అతను సామాజికంగా వెలివేయబడ్డాడు. అతని పిల్లలకి స్కూల్లో మమతా టీచర్ చెయ్యని తప్పులకి చెవులు మెలేసి, నాలుగు బెత్తం దెబ్బలు వేసింది.

ఎదురుగా వున్న 'గౌస్' కొట్లో అగ్గిపెట్టె కోసం వెళితే అతను 'నయ్యే' అని నిష్కర్షగా చెప్పేసాడు.

అతని భార్య ఎదురింటి ఆవిడని పలకరించబోతే మూతి తిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటిదాకా, మా కాలనీలో చెన్నకేశ్వరరావు అనామకుడు. ఆ తర్వాత వి.ఐ.పీ అయి ప్రతివారి సంభాషణలో చోటు చేసుకోగలిగాడు.

గాంధీబొమ్మ దగ్గర సిగరెట్లు తాగుతూ కూర్చున్న కుర్రవాళ్ళూ 'ఈ సాలెగాడు సినిమాకి రానిస్తలేడురా' అని మాట్లాడుకునేవాళ్ళు. బోరింగ్ దగ్గర నీళ్ళ బిందెలు మోస్తూ ఆడవాళ్ళు 'ఆ శ్రీలక్ష్మమ్మకి టీ.వీ వచ్చిందని మా లావు పొగరొచ్చింది' అని మాట్లాడుకోడమే.

ఇక పిల్లలు ఆడుకోడానికి వెళితే "మరి శనివారం మీ ఇంట్లో టీ.వీకి రానిస్తావా?" అని తోటి పిల్లలు బ్లాక్‌మెయిల్ చేసేవారు.

"అమ్మా మనమూ టీ.వి కొందాం" అని నేను అడిగితే మా అమ్మ "మనకి పోలీసుల్నీ ఘూర్కాలని పెట్టుకునే తాహతులేదమ్మా" అంది.

సరే ఇంతలో మా అమ్మ పిన్నికొడుకు 'బాబు మావయ్య' టీ.వి కొన్నాడన్న శుభవార్త తెలిసింది. చిక్కడపల్లిలో కాస్త 'పాష్' ఏరియాలో వుండేవాడు మా మావయ్య.

"మీరంతా వచ్చి సినిమా చూడాల్రా" అని ప్రేమగా పిలిచాడు. మేమూ, మా పెద్దమ్మ కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవలు, ఆయన చెల్లెలి కుటుంబం, బావమరుదులు అందరితో ఇల్లు కిటకిటలాడిపోయేది. మా అత్తయ్య సీతా మహాసాధ్వీలాంటిది. మా అందరికీ టీ ఇచ్చి, పల్లీలు అవీ వేయించిపెట్టి మర్యాదలు చేసేది. అందర్లా బిచ్చగాళ్ళని చూసినట్లు చూసేదికాదు. ఒక్కరు రాకపోయినా "అయ్యో లక్ష్మి రాలేదే? విజ్జి మొగుడు రాలేదే?" అనుకునేది పాపం.

కానీ పవర్ కట్స్ ఏ ప్రభుత్వం వున్నా తప్పవుగా. సినిమా మధ్యలో కరెంట్ తీసేసేవాడు. వెళ్ళిన వాళ్ళం వినోద కార్యక్రమం ఆగిపోతే వూరుకుంటామా? అమ్మకి పుట్టిన ఆరుగురం సంగీత విద్వాంసులమే అని అంతా తలో పాటా అందుకునేవారు. దాంతో ఆ రోజుకి సరదాగా సభ ముగిసేది.

శనివారం హిందీ సినిమా, ఆదివారం తెలుగూ వచ్చేవి. 'పెళ్ళికూతురూ', 'పెంకిపెళ్ళాం', 'నేనంటే నేనే', 'సతీసుమతీ', 'బండరాముడూ', 'కత్తులరత్తయ్య'. ఏ జోనర్ సినిమా అయినా సరే అంతా వెళ్ళి, చూసి కామెంట్స్ చేస్తూ ఎంజాయ్ చేసేవాళ్ళం.

ఇలా కొంతకాలం అయ్యాక, కాలనీలో చెదురూ మదురుగా కొంతమంది టీ.వీలు కొన్నారని తెలిసి, ధైర్యం చేసి మా అమ్మకూడా 'సోలిడైర్' టీ.వీ కొనేసింది. స్టాండ్, షట్టర్ లేకుండా తీసుకుంటే ఓ పన్నెండొందలు తగ్గింది. మంచి బల్లమీద, పైన లేస్ అల్లిన బట్ట వేసి టీ.వీ పెట్టాం. తెలిసిన వాళ్ళు వస్తాం అంటే కాదనకూడదు అని ముందే నిర్ణయించుకున్నాం. చెన్నకేశ్వరరావు ఇంట్లో అయిన ఫర్నీచర్ ధ్వంసం గురించి తెలుసుగా! పైగా ఇంటిమీద ఏంటెన్నా రహస్యం దాగనివ్వదుగా. అది స్టాటస్ సింబల్‌కూడా.

ఇంక మా అక్కలూ, పిల్లలూ మావయ్య ఇంటికి మానేసి మా ఇంటికే రావడం మొదలుపెట్టారు. ఉట్టి రోజుల్లో ఏడుగంటలకి ఒక గుండ్రం.. వక్రంగా మారి దాని చివర్ల తోకలొచ్చాకా మధ్యలో 'దూరదర్శన్' అని వచ్చి ఒక 'టూటుటుటూ' అన్న నేపథ్య సంగీతం పరమ విషాదంగా, ఎవరో విరోచనాల మాత్ర వేసుకున్నవాడు వాయించినట్లు వచ్చేది. అదీ రాకముందు సిగ్నల్ బొమ్మ వచ్చేది.

టీ.వీ స్టార్ట్ అయాక 'నమస్కారం విజయ దుర్గ కానీ, శాంతిస్వరూప్ కానీ, రోజారాణి' కానీ వచ్చేవారు.

ఎక్కువగా 'పాలూ చేలూ' కార్యక్రమంలో 'ఆవుపేడతో ఉపయోగాలూ', లేక 'పందుల్ని ఎలా పెంచాలీ'లాంటి కార్యక్రమాలూ వచ్చేవి.

మేం అక్కడే కంచాలు పెట్టుకుని అన్నాలు తింటుంటే మా అమ్మమ్మ 'వెధవ పంది పేడ చూస్తూ తినాలా? కంచంలో వేసినట్లుంది. అది కట్టెయ్యండి'' అనేది. కట్టేసేవాళ్ళం కాదు. బోలెడు డబ్బు పోసికొన్నాం మరి. 'బోర్‌లు' ఈ కార్యక్రమంలో బోర్‌బావుల తవ్వకాలు చూపించినా, అది పేరు సార్థకం చేసుకునే కార్యక్రమం.

ఇంక శాస్త్రీయ నృత్యాలు అయితే ప్రతిరోజూ వచ్చేవి. సంగీతంలో సంప్రదాయ సంగీతం కార్యక్రమం పట్టుచీరల ప్రదర్శనలా సాగేది.

లలిత సంగీత కార్యక్రమాల్లో ఒకతను పిచ్చి ఆసుపత్రి నుండి తప్పించుకొచ్చినట్లు చేతులూ, తలా సంబంధం లేకుండా వూపుతుంటే, ఒక గుంపు తలో శృతిలో గొంతు పైకెత్తి, వెనకాల వున్న వాళ్ళు కనపడమేమో అని, మునివేళ్ళ మీద నిలబడీ, అరుస్తూ పాడేవారు. ఆ ఇరవైమందీ, ముందే చుట్టాలకీ, స్నేహితులకీ ఉత్తరాలు రాసి ఫలానా రోజు మేం టీ.వీలో కనిపిస్తాం అని చెప్పుకునేవారు.

సోమవారాలు ప్రాంతీయ సినిమాల్లో పాటలు 'చిత్రమాల' అని వేసేవారు. లక్కీగా ఒక తెలుగుపాట ఎప్పుడైనా వచ్చేది. వరుసగా బెంగాలీ, ఒరియా, మలయాళం, మరాఠీ అన్నీ చూసేవాళ్ళం. ఏ దక్షిణాది పాటొచ్చినా 'మాతృభాష'లా ఆనందగా వుండేది. తరువాత తరువాత 'చిత్రలహరి' అని గురువారాలు కేవలం తెలుగు సినిమాల్లో పాటలు వచ్చేవి.

రంగస్థల కళాకారులంతా దూరదర్శన్‌కి వెళ్ళి నాటకాలు వెయ్యడం ప్రారంభించారు. అందులో కోటా శ్రీనివాసరావూ, సుబ్బరాయశర్మా, తనికెళ్ళ భరణీ, తల్లావజ్ఝల సుందరం, దేశిరాజు హనుమంతరావూ, చాట్ల శ్రీరాములూ మొదలైన ప్రముఖులు వుండేవారు.

మొన్న ఒక సభలో నేను వేదిక మీదున్న సీ.వి.ఎల్ నరసింహారావుగారినీ, అశోక్‌కుమార్‌గారినీ 'వీళ్ళు టీ.వీతో బాటు వచ్చిన ఏంటెన్నా'ల్లా తెలుగువారికి పరిచయం అన్నాను. వాళ్ళు నవ్వేసారు.

ఒకే కర్టెనూ, సోఫా సెట్టుతో చాలా ఏకాంకిక నాటికలు వేసేవారు. వారానికి ఒకసారి ఉత్తరాలు కూడా 'ప్రేమామాన్వి'కానీ పార్వతీశం కానీ శోభాశంకర్ కానీ చదివేవారు. ఎక్కువగా పొగిడే ఉత్తరాలే చదివేవారు. ''మీ ఎలుకల నివారణ కార్యక్రమం వినాయక చవితి రోజు ప్రసారం చెయ్యడం చాలా బావుందండీ, ఇంటిల్లపాదిమీ ఆనందించాం'' అనో, ''పందుల పెంపకంలో మెళుకువలు విజ్ఞానదాయకంగా వుందండీ'' అనో, ''అవకతవకలు నాటికలో కొన్ని డైలాగులు మరిచిపోయి పాత్రధారులు మధ్యలో తడబడినా చివరాఖరికి నాటిక రక్తి కట్టించింది'' అనో ''ఆ బృందగీతాలు కార్యక్రమంలో, వాళ్ళకి ఎడంగా నిలబడ్డాయన చెయ్యి తెగవూపుతుంటే, మా డాక్టర్ మిత్రుడు న్యూరాలజికల్ ప్రోబ్లెమ్ అనీ, నేను మూర్ఛల రోగం అనీ వాదించుకున్నాం. మొత్తానికి బావుంది'' అనో ఉత్తరాలు వచ్చేవి.

ఏది ఏవైనా ఏడుగంటలకి దూరదర్శినిని దగ్గరగా కూర్చుని దర్శించేవాళ్ళం రోజూ.

మా పిల్లలు పుట్టాక, కేబుల్ కనెక్షన్ ఇచ్చి రోజూ రెండు సినిమాలు కేసెట్ల ద్వారా వేసేవాడు కేబుల్ అబ్బాయి. కొత్త కొత్త సినిమాలు కూడా వేసేవాడు పాపం.

మా చిన్నప్పుడు రేడియో స్టేషన్‌కి తీసుకెళ్ళి బాలానందంలో పద్యమో, పాటో పాడించేవాళ్ళు.

"ఇప్పుడు చిక్కడపల్లి నుండి ఓ చిట్టి చెల్లాయొచ్చింది. చిట్టీ చిలకమ్మా పాడ్తుంది" అనగానే, ఆయాసపడిపోతూ ఓ పిల్ల "చిట్టీ... ష్..ష్ చిల్కమ్మా.. పండూ.. ష్.ష్.ష్. తెచ్చావా? గూట్లో పెట్టావా.. ష్.ష్.ష్. " అంటూ ఆయాస పడ్తుంటే " గటుక్కుమన్నావా? భలే భలే పాడిందర్రా చెల్లాయ్. చప్పట్లు కొట్టేయండి మరీ!" అని రేడియో అన్నయ్యో అక్కయ్యో పూర్తి చేసేసేవారు. కానీ రేడియోలో పాడితే గొప్ప. అలాగే టీ.వీలో పాడినా, ఆడినా కనిపించినా గొప్ప. ఇప్పుడు టీ.వీల్లో కనిపించని వాళ్ళుండరు.

ఓ మాత్రం పాటొస్తే ఏదో ఒక ఛానెల్‌లో సూపర్ సింగర్స్ అయిపోతారు. తెలుగులో కొన్ని అక్షరాలు పలకడం వస్తే చాలు ఆంకరమ్మలూ, ఆంకరయ్యలూ అయిపోతారు.

ఈ మధ్య ఒక 'ఆడపిల్ల' అమాంతం పెద్దదై తన పెళ్ళి ద్వారా న్యూస్ ఛానెల్స్‌లో సంచలనం సృష్టించింది. బహుశా భవిష్యత్తులో పాలిటిక్స్‌లో కూడా రాణించగలదు.. ఎందుకంటే ఐదునెలల క్రితం "ప్రేమిస్తే పెద్ద 'వాల్లకి' భయపడకండి... 'పెల్లి' చేసేసుకోండి" అని సందేశం ఇచ్చి, తరువాత "పెద్దవాల్ల ఇష్టాన్నికి వ్యతిరేకంగా 'పెల్లి' చేసుకోకండి.. మనకి అమ్మా నాన్నలే దేవతలు" అని ఇంకో సందేశం ఇచ్చి ఇప్పుడు మళ్ళీ "నేను అతనితోనే జీవిస్తాను. 'పెల్లి' అయ్యాక భర్తతోనే వుండాలి" అని మరో సందేశం ఇచ్చి సంచలనం సృష్టించింది. అంతేకాక తను తొందరపడి ఎవడ్నో పనిలేనివాడిని 'పెల్లి' చేసుకుని, తను ఏ.టీ.ఎం గా మారాననీ వ్యథ చెందుతూ, తను చేసిన తప్పుకి భూమ్మీద పుట్టిన ప్రతి మగాడ్నీ ఉద్దేశించి "ఈ నా కొడుకులంతా ఏం అనుకుంటున్నారూ? ఆడపిల్ల విలువ తెలుసుకోవాలి.." అని తిట్టింది. అన్నింట్లోకీ పెద్ద జోక్ "నాలాంటి సెలెబ్రెటీకే ఐకాన్ కీ ఇలా అయితే మిగతా ఆడపిల్లల గతేవిటీ?" అని పద్దెనిమిదేళ్ళు నిండిన రెండు నెలల పదమూడు రోజులకి తెగ బాధపడింది. పైగా తనకి మెచ్యూరిటీ ఎక్కువట. సుశీలమ్మా, జానకమ్మా, మొదలైన వాళ్ళు ఇలా 'సెలెబ్రెటీలం' అని అన్నారో లేదో? కానీ ఇలా టీ.వీలో నిన్నగాక మొన్నపాడినవాళ్ళు అనేసుకుంటున్నారు. నేషనల్ బడ్జెట్ న్యూస్ ఆపేసి మరీ ఇది చూపించాయి తెలుగు ఛానెళ్ళు.

నేను మా టీ.వీలో పనిచేసే రోజుల్లో ఇంకా నోరు తిరగకుండా, కొన్ని అక్షరాలే పలికే ఓ ఆరేళ్ళ పాప చేత తెగ పాడించేవారు. ఆ పాప ఒకరోజు ఏదో ఫంక్షన్‌లో ఫస్ట్‌రోలో ఖాళీలేక సెకండ్ రోలో కూర్చునుంటే "నేను సెలబ్రెటీని.. ఫస్ట్‌రోలోనే కూచుంటా.." అనడం నేను విన్నాను. ప్రోగ్రాం అవుతుండగా అక్కడే గౌను తడిపేసుకుంది నిద్రలో. అభం శుభం తెలీని వయసులో ఈ ఎక్స్‌పోజర్ వీళ్ళకి మంచే చేస్తోందా?

ఒకే ఛానెల్ వున్నప్పుడు ఆడవాళ్ళు ఇంటి పనులన్నీ చేసుకుని సాయంత్రాలు టీ.వీ చూసేవారు. హిందీ నేషనల్ న్యూస్ అయితే, కేవలం ఆ న్యూస్ రీడర్స్ 'మంజరీ సహాయ్' 'జె.వీ రమణ్' లాంటి వాళ్ళ ఉచ్చారణ కోసం చూసేవాళ్ళం.

బోలెడు ఛానెల్స్ వచ్చేసినా, హిందీలో జీటీవీలో 'ఏ జో హై జిందగీ', 'అడోస్ పడోస్' 'హమ్ హిందుస్తానీ హై' 'ముంగేరీ లాల్ కే హసీన్ సప్నే', 'వాగ్లే కీ దునియా' లాంటివీ, జెస్‌పాల్ భట్టీ 'ఫ్లాప్ షో'లాంటి హిల్లేరియస్ కామెడీ షోస్ వచ్చేవి.

మొదటి సీరియల్స్ 'బునియాద్', 'బీబీ నాతియోం వాలా', 'హమ్‌లోగ్', 'శాంతీ' ఎప్పటికీ మరిచిపోలేం.

తెలుగులో కొంచెం నాసిగా మొదలు పెట్టినా, తరువాత తరువాత అందుకున్నారు.

ప్రస్తుతం ఎంత సాంకేతిక ప్రగతి సాధించాం అంటే 'ఎవడికి వాడు తోపులు' అని, వీడియోలు తీసుకోవడం. 'యూ ట్యూబ్'లో అప్‌లోడ్ చేసేసుకోడం.

ప్రతి సెల్‌లో కెమేరా వుంటుంది. మొన్న ఓ సెలెబ్రెటీ, సినిమా ఏక్టరూ బాధపడ్డారు. "అడగకుండా సెల్‌లో దూరం నుండి ఫోటోలూ, వీడియోలూ తీసేస్తుంటారు. అప్పుడు మేం ముక్కులో వేలు పెట్టుకునో, అసహ్యంగా ఆవలిస్తునో, గోక్కోకూడని చోట గోక్కుంటూనో వుంటాం.. నెక్స్‌ట్ మినిట్ అవి ఎఫ్.బి.లో పోస్ట్ చేస్తారు. వీళ్ళని ఎలాగండీ ఆపడం? మేమూ సామాన్య మనుషులమేగా!" అని బాధపడ్డాడు.

ఏ ఇంట్లో అయినా 'పొయ్యి' వుండదేమో కానీ టీ.వి లేని ఇల్లు వుండదు. "ఇట్స్ నాట్ ఏ లగ్జరీ ఎనీమోర్.. ఇట్స్ ఏ నీడ్" గది గదికీ ఓ టీ.వీ. అది గుడిశ అయినా లేక వాళ్ళు ఖాళీ డ్రైనేజ్ పైపుల్లో నివాసం వున్నా పోర్ట్‌బుల్ టీ.వీ వుంటుంది. కార్లో సైతం వుండాల్సిందే. అదీ ప్రస్తుత పరిస్థితి. మరి ఇప్పుడు ఈ టీ.వి ఛానెళ్ళు వాళ్ళూ, జర్నలిస్టులూ ఎంత బాధ్యతతో వ్యవహరించాలి?

నేను ఇందాక చెప్పిన సెలెబ్రెటీ, ఆడపిల్ల "మాట్లాడలేనక్కా.. నీరసంగా వుంది. నిన్నంతా హాస్పిటల్‌లో వుండి వచ్చా.." అని బతిమాలుతున్నా ఆ రిపోర్టర్ అడిగిన ప్రశ్నలే మళ్ళీ మళ్ళీ అడుగుతోంది. "వదిలి పెట్టకు.. కంటిన్యూ చెయ్యి అలాగే అంటుంది" అని ఆమె ఇయర్ ప్లగ్‌లో ఒకడు చెప్పడం మనకి వినిపిస్తోంది.

**మానవత్వమా ఎక్కడున్నావు?**




COMMENTS

